క్లుప్తంగా

పన్ను వసూలు వందశాతం పూర్తి



నవాబుపేట: పంచాయతీల పన్నుల వసూలు మండలంలో వంద శాతం పూర్తయింది. మార్చి టార్గెట్ నేపథ్యంలో మండలంలో విలీన గ్రామాలు మినహాయించి 42 పంచాయతీలలో పన్నుల వసూలు చేపట్టారు. కాగా వంద శాతం టార్గెట్‌తో ముందుకు వెళ్లారు. మండలంలో ఈ నెల మొదటి వారంలో 36 పంచాయతీల్లో టార్గెట్ పూర్తి అయ్యింది. కాగా మిగత 6 గ్రామాలకు ఈ నెల 15 వరకు గడువు ఇచ్చి వంద శాతం వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండలంలో పన్నుల వసూలు మరింత వేగం పెరిగింది. మొత్తం 42 గ్రామ పంచాయతిల్లో 64. 23లక్షలు వసూలు చేయాల్సి ఉండగా మార్చి ఆఖరు వరకు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ బద్రునాయక్ తెలిపారు. కాగా మరికొన్ని గ్రామాలు నవాబుపేట, ఇప్పటూర్, కొల్లూర్, కారుకొండ, కూచూర్, చౌడూర్ గ్రామాల్లో టార్గెట్‌కు మించి అదనంగా వ్యాపార తదితర లైసెన్సుల ద్వారా పన్నులు వసూలు చేయడం విశేషం. అయితే పన్నుల వసూలులో మార్చిలోనే టార్గెట్ పూర్తి చేయటం గడిచిన మూడు సంవత్సరాల్లో ఇదే మొదటిసారి కావటం విశేషం. గత ఏడాది ఏప్రిల్ నెలాఖరు నాటికి సైతం పంచాయతీల పన్నుల వసూలు 78 శాతం మాత్రమే జరగగా తాజాగా మార్చి నెల పూర్తి కాకముందే పూర్తిచేయడంలో అధికారులు సఫలం అయ్యారు.

నేడు టెంకాయల వేలం

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మ ఆలయం వద్ద శనివారం టెంకాయలు, పూజా సామగ్రిల విక్రయంపై టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, అధికారి మధనేశ్వర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఏటా నిర్వహించే టెండర్లు గత నెలలో చేపట్టామని.. కానీ టెండరుదారులు నిబంధనలు పాటించక పోవటంతో రద్దు చేశామన్నారు. తాజాగా మరోసారి నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

నేటి నుంచి బొడ్రాయి ఉత్సవాలు

నవాబుపేట: దయాపంతులపల్లిలో శనివారం నుంచి సోమవారం వరకు బొడ్రాయి, గణపతి, శివలింగం, నందీ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యాక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు చెన్నయ్య, ప్రభాకర్, రఘు, సత్యం శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విగ్రహాల ధాన్యదివాసం, ఆదివారం హోమం, సోమవారం ప్రతిష్ఠ ఉంటుందని వివరించారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

ఊట్కూరు: మండలంలోని సమస్తాపూర్ గ్రామశివారుని శ్రీ శంకరలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవాన్ని వైభవంగా భక్తులు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నందికొండ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం దేవాలయం ప్రాంగణంలో అగ్నిగుండం ఏర్పాటుచేశారు. భక్తులు ఓంనమఃశివాయ అంటూ అగ్నిగుండంలో నడుచుకుంటూ వెళ్లారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మట్టిరోడ్లు ఇంకెన్నాళ్లు?



సోమ్లాతండాకు వెళ్లే మట్టిరోడ్డు

- తండాలకు కలగా మారిన తారురోడ్లు
- శిలా ఫలకాలకే పరిమితం
- టెండర్లు పూర్తి అయినా పనులకు మోక్షం లేని వైనం

రాజాపూర్: మండల పరిధిలోని పలు తండాలకు బీటీ రోడ్ల ఏర్పాటు కలగా మారుతోంది. దీంతో ఆయా తండాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా ఎంతకాలం మట్టిరోడ్లతో కాలం వెళ్లదీయాలని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలం వస్తే తమకు మరిన్ని సమస్యలు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ లోపే చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పరిస్థితి ఇలా..

రాజాపూర్ మండలంలోని నర్సింగ్‌తండా, మోత్కులకుంటతండా, సోమ్లాతాండా, బీబీనగర్, ప్రేమ్లీతండా, వాచ్యతండా తదితర తండాలకు బీటీరోడ్లు లేవు. గత ఎన్నికల ముందు అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సోమ్లాతండాకు రూ. 1.10 కోట్లతో బీటీరోడ్డు మంజూరుకావడంతో ఎన్నికల కోడ్ వస్తుందని.. శిలాఫలకం వేయించి శంకుస్థాపన చేయించారు. కానీ నాటి నుంచి నేటివరకు పనులే ప్రారంభం కాలేదు. అధికారుల అలసత్వమో, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో గానీ తమ తండాల రోడ్లకు మాత్రం మోక్షం కలగడం లేదని ప్రజలు వాపోతున్నారు.

త్వరగా ప్రారంభించాలి



ఎన్నో సంవత్సరాలుగా మా తండాకు మట్టిరోడ్డే ఉంది. కాగా తారురోడ్డు ఏర్పాటుకు ఇటీవల చర్యలు చేపట్టారు. నిధులు సైతం మంజూరు అయ్యాయి. దీంతో సమస్య తొలగిందనుకున్నాం. కానీ శిలాఫలకం వేసి వదిలేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలం రాకముందే పనులు మొదలుపెట్టి పూర్తి చేయాలి.

– సతీష్‌రాథోడ్, సోమ్లాతండా

ఇబ్బందులు పడుతున్నాం



ప్రస్తుతం మట్టిరోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇక వర్షాకాలం వస్తే మరిన్ని కష్టాలు తప్పవు. కాలేజీకి వెళ్లాలంటే రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆటోవాళ్లు కూడ రారు. రాజాపూర్ వెళ్దామన్నా ఇబ్బందులు తప్పడంలేదు. సంబంధిత అధికారులు పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలి.

– పాత్లావత్ వసంత, విద్యార్థిని, సోమ్లాతండా

వెలుగొమ్ములలో అధికారుల పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మిడ్జిల్: వెలుగొమ్ములలో నీటి సమస్య తీరేనా? అంటూ శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను అడిగి నీటి ఇబ్బందులను తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని బోరును పరిశీలించారు. నీటి సమస్య గురించి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని డీఎల్‌పీఓ. పాండరీనాథ్ తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ అనురాధ, మిషన్ భగీరథ ఏఈ లావణ్య, పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ,, గ్రామ పెద్దలు శ్రీధర్‌రావు, నాగయ్య, రవీందర్‌రెడ్డి, బాబా, వీరాజీ, తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని బాబిస్ట్రీట్‌లో మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. పదేళ్లుగా ప్రతి వేసవిలోనూ మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. గంజితోపాటు వస్త్రదుకాణాలకు వచ్చే వారికి చలివేంద్రం ఎంతో సౌకర్యంగా మారింది. కార్యక్రమంలో మార్వాడి సమాజ్ సభ్యులు సురేష్, భగవాన్ జవహర్, గోవింద్ లాహోటి, సునీల్ సాంక్ల, గోపాల్ శర్మ, బాలకిషన్ అగర్వాల్, శంకర్ జవహర్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత కేసునమోదు

మిడ్జిల్: బోయిన్‌పల్లిలో గ్రామానికి చెందిన రమేష్ కిరాణం దుకాణంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడులు చేశారు. కాగా ఘటనలో 9 లీటర్ల మద్యం పట్టుబడింది. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ఆనంద్ వివరించారు. అదేవిధంగా యజమాని రమేష్‌పై కేసునమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయం నేరమన్నారు. అనధికారికంగా నిర్వహించే బెల్ట్‌షాప్‌లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'టెట్' నిబంధనలు సడలించాలి

నవాబుపేట: టెట్ విషయంలో ప్రభుత్వం పెట్టిన పలు నిబంధనలు సడలించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిసింగ్ కోరారు. ఈ విషయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ టెట్ రాసే ఉపాధ్యాయులకు పేపర్ -1 కోసం ఇంటర్‌తో పాటు డీఎడ్, టీటీసీ ఉండాలన్న నిబంధనలతో గతంలో బీఏడ్ చేసి ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న వారు నష్టపోతారని ఆయన తెలిపారు. ప్రమోషన్ల విషయంలో తీవ్రంగా నష్ట కలుగుతుందని వివరించారు. పేపర్- 2కి సంబంధించి డిగ్రీలో 50 శాతం మార్కులు తప్పని సరిగ్గా ఉంటేనే అర్హత అంటూ పెట్టిన నిబంధనతోనూ ఇబ్బందులు తప్పవని సడలించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వాకిటి యాదయ్య గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యాదయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మాయాదవ్, చంద్రశేఖర్, శివరాములు తదితరులు ఉన్నారు.

ప్రజాధనాన్ని నీటిపాలు చేశారు



జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గత ప్రభుత్వ హయాంలో అన్ని కుంభకోణాలే జరిగాయని, అందులో మినీ ట్యాంక్‌బండ్ కూడా ఒకటి అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. రూ.50 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం చేపట్టినా ఏ మాత్రం పనులు పూర్తికాలేదన్నారు. ఎలాంటి ప్రణాళికలు లేకుండా ప్రజా. ధనాన్ని నీటిపాలు చేశారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వీలైనంత త్వరగా జిల్లాలో డ్రెయినేజీలను పూర్తి చేసి స్వచ్ఛ్ మహబూబ్‌నగర్‌ను తయారుచేద్దామని అన్నారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, ఎన్‌పీ.వెంకటేశ్, రాఘవేందర్‌రాజు, అబ్దుల్ హక్, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, జహీర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మహమ్మదాబాద్/ గండేడ్: మండల పరిధిలోని మొకర్లాబాద్ సమీపంలో గురువారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన వెలుగుచూసింది. 108 సిబ్బంది తెలిపిన కథనం మేరకు వివరాలు.. వికారాబాద్ జిల్లా దోమ మండలం ఐనాపూర్‌కు చెందిన కుర్మయ్య తన కారులో మహబూబ్‌నగర్ వైపు వస్తున్నాడు. నంచర్లగేట్ క్రాస్‌రోడ్డు నుంచి ముకర్లాబాద్ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన కుర్మయ్యను స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం

భూత్పూర్ : మండలంలోని కొత్త మొల్గరకి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు గ్రామానికి చెందిన వెంకటయ్య మనుమరాలు గురువారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నోట్ బుక్స్ తీసుకవస్తానని చెప్పి ఇంట్లోంచి వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో గ్రామంలో బంధువుల వద్ద కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గ్రామానికి చెందిన రవిపై అనుమానం ఉన్నట్లు వెంకటయ్య శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు వివరించారు.

రాములు మృతి తీరనిలోటు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ ఎం.రాములు మృతిచెందారని సీపీఎం నాయకులు శుక్రవారం తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి ఏ.రాములు, సీనియర్ నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. ఈ మేరకు సంతాపం ప్రకటించారు. ఎస్‌ఎఫ్‌ఐలో ఉద్యమాలు, సీపీఎం సభ్యుడుగా ఆయన సేవలు మరువలేనివన్నారు.

దేశంలో లౌకికత్వానికి ప్రమాదం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశంలో లౌకికత్వానికి ప్రమాదం ఏర్పడిందని చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరగగా పాల్గొని మాట్లాడారు. గత పదేళ్లలో ధనవంతులు మాత్రమే ఎదిగారని అని ఆరోపించారు. సమ సమాజ స్థాపన కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. దేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కమ్యూనిస్టులు తోడైతే విజయం ఎంతో దూరం లేదన్నారు. బీజేపీ నుంచి దేశాన్ని విముక్తి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మరోసారి మోదీ ప్రధాని అయితే రాజ్యాంగాన్ని మారుస్తారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ నరసింహ అన్నారు. వారి పాలనలో ఎవరికీ రక్షణ లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇతర మతాలను రెచ్చగొట్టే విధంగా చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. సంపదలను కొందరికి మాత్రమే కట్టబెడుతున్నారని, అన్నారు. జై షాకు రూ. 80 వేల కోట్ల ఆస్తులు ఎక్కడివన్నారు. బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. వంశీచందర్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బంగి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నారాయణపేట, వనపర్తి కార్యదర్శులు కొండన్న, విజయరాములు ఏఐటీయూసీ నాయకులు సురేష్, సీపీఐ రాష్ట్ర నాయకులు పరమేశ్వర్ గౌడ్, ఆల్వాల్ రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రైతులు, కూలీలకు ఫించన్ ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతులకు, రైతు కూలీలకు ప్రభుత్వం అండగా నిలబడి ఫించన్ ఇవ్వాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయ కర్త బిచ్చారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాగుకు నీళ్ల లేక కళ్ల ముందే పంటలు ఎండి పోతున్నాయని అన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వాలు రైతుల విషయంలో రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. వెంటనే స్పందించి నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ జాతర కరపత్రం విడుదల

దేవరకద్ర: మండల కేంద్రంలో శుక్రవారం పులే, అంబేడ్కర్ 4 జాతర కరపత్రంను విడుదల చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సంఘం భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో జాతర కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర్, ఆంజనేయులు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లాగా నిర్వహించే జాతరపై విస్తృతంగా ప్రచారం చేయాలని వారు కోరారు. యువజన సంఘం అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు ప్రదీప్, ప్రతినిధులు జగన్‌మోహన్, నరేష్, శ్రీనివాసులు, రవి, నవీన్ పాల్గొన్నారు.

కేంద్రం పథకాలపై ప్రచారం చేయాలి

జడ్చర్ల టౌన్: మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా బీజేపీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ప్రవీణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఓబీసీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మూడోసారి మోదీ అన్న నినాదంతో ప్రజల ముందుకు వెళ్లి అమలు చేస్తున్న పథకాలు వివరించాలన్నారు. మోదీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలియజేసి ఓట్లుగా మల్చుకోవాలన్నారు. గత పదేళ్లలో ప్రపంచంలో దేశాన్ని సముచితస్థానంలో నిలబెట్టారన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓబీసీలు కీలక పాత్ర పోషించాలన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్

సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌జీ, నాయకులు అశోక్, శ్రీనివాస్‌గౌడ్, శివ, రామకృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

వాసవీమాతకు ఘనంగా పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: పట్టణంలోని రాయిచూర్ రహదారిపై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, పల్లకీసేవా తదితర కార్యక్రమాలు ఘనంగా సాగాయి.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



జిల్లాకేంద్రంలో పార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. పాపంలో కూరుకుపోయిన లోక మానవాళి కోసం యేసు క్రీస్తూ శిలువ త్యాగం చేశారని పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని రెమా వర్షిప్ సెంటర్‌లో ప్రార్థనలు నిర్వహించారు. పరంజ్యోతి ప్రసంగిస్తూ యేసు క్రీస్తూ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ఆయనకు సాక్షులుగా రాణించేందుకు కృషి చేయాలని కోరారు. యేసు ప్రభువు శిలువలో పలికిన ఏడుమాటలను బోధించారు. వాటిని అనుసరించాలని సూచించారు. సంఘ పెద్దలు దేవయ్య, భరత్, శ్యాంసుందర్, ప్రసన్నకుమార్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల పరిధిలోని అన్ని చర్చ్‌లలో ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో అతిపెద్దదైన బేథని యంబీ చర్చ్‌లో ఫిలమోన్ అధ్యక్షతన నిర్వహించిన ప్రార్థనల్లో క్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ఏడుగురు వినిపించారు. మాటలను పలికిన వారిలో ఫిలమోన్ ఎబినేజర్, విద్యాసాగర్, మైకేల్ మనోమర్ , సుందర్‌పాల్, దేవదానం, రెవరెండ్ విలియంబూత్ ఉన్నారు. అనంతరం ప్రత్యేక గీతాలను ఆలపించారు. విలియంబూత్ ఆశీర్వాదంతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు ముగించారు. అలాగే క్రీస్తురాజుదేవాలయం, యంబి సెంటినరి చర్చ్‌లలోనూ పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు జరిపారు. మండలంలోని కొండేడ్, గంగాపురం, కుర్వగడ్డపల్లి గ్రామాల్లోనూ గుడ్‌ఫ్రైడే నిర్వహించారు.

చిన్నచింతకుంట మండల కేంద్రంలోని యంబీ సియోన్ చర్చ్‌లో కార్యక్రమం నిర్వహించారు. 40 రోజులపాటు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టి శుక్రవారం యేసుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రెవ జమిమా ప్రసంగించారు. గిద్యోన్, సంఘచైర్మన్ జి. మోషే, జి.యోనా, సి.సుదర్శన్, ఎస్ శేఖర్, సొలురాజ్, ఆనంద్, ఫిలోగ్, మాలాగర్, ప్రతాప్, యాకోబ్, రాజు పాల్గొన్నారు.

మిడ్జిల్ పరిధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక గీతాలను ఆలపించారు. పాస్టర్లు జాన్‌పాల్, దేవదాసునాయుడు, సువార్తరాజు, తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో ప్రార్థనలు



చిన్నచింత కుంటలో ప్రార్థనలు



మిడ్జిల్ మండలంలోని వాద్యాల్‌లో

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

దేవరకద్ర: తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనార్దన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. దివంగత నేత నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీని ప్రజలు ఇంకా మరువలేదని ఆయన అన్నారు.